

8లో..

## అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

- అటవీ, పర్యావరణ శాఖ మంత్రి సురేఖ
- సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష


# వరంగల్ వాయిస్
Evening Daily

సంపుటి : 04 | సంచిక : 203
పేజీలు : 08 | వెల: రూ.5/-
మంగళవారం
మే 13, 2025
www.epaper.warangalvoice.net | www.warangalvoice.net




# వరంగల్ జరూర్ ఆనా..

- నగరానికి ప్రపంచ సుందరీమణుల రాక
- విశ్వవ్యాప్తం కానున్న ఓరుగల్లు ఖ్యాతి
- రేపు వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన
- వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్ తోపాటు రామప్ప సందర్శన
- కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ప్రజలు

ఓరుగల్లు అంటేనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు పుట్టినిల్లు.. చరిత్రకు నిలువెత్తు నిదర్శనం.. భవ్య, దివ్య, నవ్య నగరంగా పేరు గాంచింది. అంతేకాకుండా కాకతీయ సామ్రాజ్య రాజధాని నగరం. రమణీయ శిల్ప సౌందర్యం.. అద్భుతమై ఆలయాలు.. అలరించే రాజస కట్టడాలు.. వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయాలు.. త్రినగరిలో ఒకటి కాదు రెండూ కాదూ.. ఏకంగా వేయి స్తంభాలతో నిర్మించిన త్రికూటాలయం.. అంతేకాదు వరంగల్ కోట కాకతీయ సామ్రాజ్య కాలంలో ఒక ఐతిహాసిక దుర్గం.. కాకతీయులు అద్భుతంగా నిర్మించారు. రాజుల కట్టడాలు ఆనాటి చరిత్రకు నిలువెత్తు సాక్ష్యాలు.. వరంగల్ కోటలోని కీర్తి తోరణాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంగా ఎంచుకుంది.. తద్వారా తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును ప్రపంచ వ్యాప్తంగా చాటుతోంది.. దీంతోపాటు యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయం కాకతీయుల శిల్ప కలకు సజీవ సాక్షంగా నిలుస్తోంది. ఈ అందాలను తిలకించేందుకు విశ్వ సుందరీమణులు బుధవారం సాయంత్రం ఓరుగల్లులో అడుగుపెట్టనున్నారు. వీరి రాకకోసం ఓరుగల్లు ప్రజలు వేయి కళ్లతో ఎదురు చూస్తున్నారు. ప్రపంచ సుందరీమణుల రాక సందర్భంగా జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు చేశారు. – వరంగల్ వాయిస్, వరంగల్

వివరాలు 2లో..







# వరంగల్.. జరూర్ ఆనా..

- నగరానికి ప్రపంచ సుందరీమణుల రాక
- విశ్వవ్యాప్తం కానున్న ఓరుగల్లు ఖ్యాతి
- రేపు వరంగల్, ములుగు జిల్లాల్లో పర్యటన
- వేయి స్తంభాల గుడి, ఖిలా వరంగల్ తోపాటు రామప్ప సందర్శన
- కలెక్టర్ల ఆధ్వర్యంలో పకడ్బందీ ఏర్పాట్లు
- వేయి కళ్లతో ఎదురుచూస్తున్న ప్రజలు

**ఓరుగల్లు అంటేనే తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలు.. చరిత్రకు నిలువెత్తు నిదర్శనం.. భవ్య, దివ్య, నవ్య నగరంగా పేరు గాంచింది. అంతేకాకుండా కాకతీయ సామ్రాజ్య రాజధాని నగరం.. రమణీయ శిల్ప సౌందర్యం.. అద్భుతమై ఆలయాలు.. అలరించే రాజస కట్టడాలు వెయ్యేళ్లకు పైగా చరిత్ర కలిగిన ఆలయం.. ఒకటి కాదు రెండూ కాదూ.. వేయి స్తంభాలతో త్రినగరిలో కొలువైన త్రికూటాలయం.. వరంగల్ నగరానికి వన్నె తెచ్చిన కట్టడాలు అనేకం.. కాకతీయ రాజుల కట్టడాలు.. నేటికీ ఆనాటి చరిత్రకు నిలువెత్తు నిలబడి ఉన్న సాక్ష్యాలు..**

వరంగల్ కోట కాకతీయ సామ్రాజ్య కాలంలో ఒక ఐతిహాసిక దుర్గం.. కాకతీయులు అద్భుతంగా నిర్మించారు. వరంగల్ కోటలోని కీర్తి తోరణాన్ని తెలంగాణ ప్రభుత్వం రాష్ట్ర చిహ్నంగా ఎంచుకుంది.. తద్వారా తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును ప్రపంచవ్యాప్తంగా చాటుతోంది.. దీంతోపాటు రామప్ప ఆలయం కాకతీయ రాజవంశం ఆధ్వర్యంలో 13వ శతాబ్దంలో అద్భుతంగా నిర్మించారు. ఈ ఆలయాన్ని కాకతీయ రాజు గణపతి దేవుని సైన్యాధ్యక్షుడైన రేచర్ల రుద్రుడు నిర్మించారు. శిల్పి రామప్ప పేరు మీదుగా ఈ ఆలయాన్ని పిలుస్తారు. ఇది ఒక అరుదైన ప్రత్యేకత. ఇంతటి ప్రఖ్యాతులు సాధించిన ఆలయాలు.. పర్యాటకంగా పేరుగాంచిన ప్రాంతాలను తనివీ తీరా పరిశీంచేందుకు ప్రపంచ సుందరీమణులు తరలిరావడం వరంగల్ గొప్ప తనం ఇట్టే తెలుస్తోంది.. ప్రపంచ సుందరీమణులు (మిస్ వరల్డ్–2025 పోటీదారులు) బుధవారం వరంగల్ జిల్లా పర్యటనకు వస్తున్నారు. ఈ నేపథ్యంలో వరంగల్‌లోని పలు దర్శనీయ ప్రాంతాలను సందర్శించనున్నారు. ఇందులో భాగంగానే వరంగల్ నగర వారసత్వాన్ని, సాంస్కృతిక సంపదను ప్రపంచానికి పరిచయం చేసే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నది. ఇందుకోసం పర్యాటక శాఖ విస్తృతంగా ఏర్పాట్లు చేస్తోంది. బుధవారం తొలుత 35 మందితో కూడిన అందాల భామల బృందం వేయిస్తంభాల ఆలయ నిర్మాణం, శిల్ప వైభవాన్ని, వరంగల్ కోటలో కాకతీయుల కీర్తి తోరణంతో పాటు శిల్పసంపదను పరిశీలిస్తుంది. కాగా, 22 మంది అందగత్తెలతో కూడిన మరో బృందం హైదరాబాద్ నుంచి నేరుగా ములుగు జిల్లాలోని రామప్ప ఆలయానికి చేరుకుని... అక్కడి శిల్ప సౌందర్యాన్ని పరిశీలిస్తారు. పేరిణి నృత్య ప్రదర్శనను తిలకిస్తారు. రాత్రి హరిత హోటల్ లో డిన్నర్ పూర్తి చేసుకుని హైదరాబాద్‌కు తిరుగు ప్రయాణమవుతారు. ఆయా జిల్లాల కలెక్టర్లు అందాల భామల పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేపట్టారు. వారికి ఎక్కడా ఏలాంటి ఇబ్బందిరాకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున భద్రత ఏర్పాట్లు చేపడుతున్నారు. ప్రభుత్వం వీరి పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నది. మిస్ వరల్డ్ పోటీల నేపథ్యంలో ప్రతి అంశంలోనూ తెలంగాణ ఖ్యాతి ప్రతిబింబించేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. 'తెలంగాణ జరూర్ ఆనా'అనే థీమ్‌తో ప్రభుత్వం అందాల భామలు ప్రాచీన ఆలయాలు.. పర్యాటక ప్రాంతాల అందాలు తిలకించేలా ప్రణాళిక రచించింది. తద్వారా వరంగల్ ఖ్యాతి ప్రపంచానికి పరిచయం చేయనున్నారు.



## చారిత్రాత్మక ఆలయం.. వేయి స్తంభాల గుడి

వేయి స్తంభాల గుడి, రుద్రేశ్వర స్వామి ఆలయం అని కూడా పిలువబడే ఈ ఆలయం చారిత్రాత్మక హిందూ దేవాలయం. తెలంగాణ రాష్ట్రంలోని హనుమకొండ జిల్లా కేంద్రంలో ఉంది. ఈ ఆలయం కాకతీయ వంశ రాజుల కళా నైపుణ్యానికి, శిల్పకళా చాతుర్యానికి నిదర్శనంగా నిలుస్తోంది. ఈ ఆలయం శివుడు, విష్ణువు, సూర్యునికి అంకితం చేయబడింది. యునెస్కో ప్రపంచ వారసత్వ ప్రదేశాల తాత్కాలిక జాబితాలో చేర్చబడింది. ఈ ఆలయం క్రీ.శ. 1163లో కాకతీయ రాజు రుద్రదేవుని ఆదేశాల మేరకు నిర్మించారు. ఈ ఆలయం చాళుక్య శైలిలో నిర్మించబడింది. అయితే కాకతీయుల శిల్పకళా వైభవం దీనిలో స్పష్టంగా కనిపిస్తుంది. నక్షత్రాకార పీఠంపై నిర్మితమైన ఈ త్రికూటాలయం అద్భుతమైన వాస్తుకళకు నిదర్శనం. కళ్యాణ మంటపం, ప్రధాన ఆలయంతో కలిపి సుమారు వేయి స్తంభాలతో నిర్మించడంతో దీనికి 'వేయి స్తంభాల గుడి' అనే పేరు వచ్చింది. 2005–2006లో భారత పురావస్తు శాఖ ఆధ్వర్యంలో కళ్యాణ మంటపంలోని కొన్ని స్తంభాల పునర్నిర్మాణం జరిగింది. 2024లో 17 సంవత్సరాల తర్వాత కళ్యాణ మంటపం సందర్శకుల కోసం తిరిగి తెరిచారు. వేయి స్తంభాల గుడి కాకతీయ సామ్రాజ్య కళా వైభవానికి, శిల్పకళా నైపుణ్యానికి, ఇంజినీరింగ్ చాతుర్యానికి నిలువెత్తు సాక్ష్యంగా నిలిచింది. ఈ ఆలయం తెలంగాణ సాంస్కృతిక వారసత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తుంది. ప్రపంచవ్యాప్తంగా పర్యాటకులను, చరిత్ర పరిశోధకులను ఆకర్షిస్తోంది.

## కాకతీయుల వైభవానికి నిదర్శనం.. వరంగల్ కోట

వరంగల్ కోట కాకతీయ సామ్రాజ్యం కాలంలో నిర్మితమైన ఒక ఐతిహాసిక దుర్గం. ఈ కోట క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి 13వ శతాబ్దం వరకు విస్తరించిన చరిత్రను కలిగి ఉంది. కాకతీయులు క్రీ.శ. 750–1323 ఈ కోటను నిర్మించి, తమ రాజధానిగా చేసుకున్నారు. కాకతీయులు తమ పరిపాలనలో ఈ కోటను దుర్భేద్యంగా, అద్భుత నిర్మాణాలతో తీర్చిదిద్దారు. కోటలోని మూడు వృత్తాకార పొరలు, నాలుగు భారీ రాతి ద్వారాలు (కీర్తి తోరణాలు), స్వయంభూ శివాలయం వంటివి కాకతీయుల నిర్మాణ వైభవానికి నిదర్శనం. కాకతీయ రాజు ప్రోల రాజు ఈ కోట నిర్మాణానికి పునాది వేశారని ప్రజలు నమ్ముతారు. గణపతి దేవుడు, రుద్రమ దేవి, ప్రతాపరుద్రుడు వంటి రాజులు ఈ కోటను మరింత బలోపేతం చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం వరంగల్ కోటను ఒక ముఖ్యమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వ స్థలంగా గుర్తించి, దాని పరిరక్షణ.. పర్యాటక అభివృద్ధికి ప్రాధాన్యం ఇస్తోంది. కాకతీయ సాంస్కృతిక వారసత్వాన్ని ప్రోత్సహించేందుకు కాకతీయ వైభవ సప్తాహం వంటి కార్యక్రమాలను నిర్వహిస్తోంది.వరంగల్ కోటలోని కాకతీయ కళా తోరణం (కీర్తి తోరణం) తెలంగాణ రాష్ట్ర అధికారిక చిహ్నంగా గుర్తింపు పొందింది. ఈ తోరణం కాకతీయుల నిర్మాణ కళాత్మకతకు, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలుస్తోంది. తద్వారా తెలంగాణ సాంస్కృతిక గుర్తింపును ప్రపంచవ్యాప్తంగా చాటుతోంది.



## రామప్ప ఆలయం విశిష్టత..

ములుగు జిల్లా, వెంకటాపూర్ మండలం పలంపేట గ్రామంలో రామప్ప ఆలయం ఉంది. ఈ ఆలయం కాకతీయ రాజవంశం ఆధ్వర్యంలో 13వ శతాబ్దంలో నిర్మించారు. ఈ ఆలయాన్ని కాకతీయ రాజు గణపతి దేవుని సైన్యాధ్యక్షుడైన రేచర్ల రుద్రుడు నిర్మించారు. శిల్పి రామప్ప పేరు మీదుగా ఈ ఆలయాన్ని పిలుస్తారు. ఇది ఒక అరుదైన ప్రత్యేకత. ఈ ఆలయం రామలింగేశ్వర దేవాలయం అని కూడా పిలుస్తారు. శివునికి అంకితం చేయబడింది. రామప్ప ఆలయం కాకతీయ శైలిలో నిర్మించారు. ఇది ఎత్తైన నక్షత్ర ఆకారపు పీఠంపై తూర్పు దిశాభిముఖంగా నిర్మితమై ఉంది. జులై 25, 2021న, రామప్ప ఆలయం యునెస్కో ప్రపంచ వారసత్వ స్థలంగా గుర్తింపు పొందింది. ఈ గుర్తింపు కోసం 255 కట్టడాలు పోటీపడగా, 17 దేశాల ప్రతినిధులు రామప్పకు అనుకూలంగా ఓటు వేశారు. దీంతో యునెస్కో వారసత్వ హోదా సాధించింది. ఆలయం కాకతీయ శిల్పకళా వైభవానికి చిహ్నంగా నిలుస్తుంది. దీని నిర్మాణ సాంకేతికత సౌందర్యం ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందాయని ఓ సందర్భంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు.

ఇంతటి అద్భుతమైన ఆలయాలు, పర్యాటక ప్రాంతాల అందాలను తిలకించేందుకు ప్రపంచ అందాల భామలు తరలిరావడం చరిత్రలో కొత్త అధ్యాయనానికి నాంది పలుకుతోంది. వరంగల్ కీర్తి ప్రతిష్టలు ప్రపంచ వ్యాప్తంగా మారుమ్రోగడం జిల్లా ప్రజల అదృష్టంగా చెప్పవచ్చు. వీటన్నంటినీ తిలకించే అందాల భామలు మంత్రముగ్ధులు కావడం మాత్రం నిజం. ప్రపంచసుందరీమణుల పర్యటనను విజయవంతం చేసేందుకు జిల్లా అధికారులు సకల ఏర్పాట్లు చేస్తుంటే.. జిల్లా ప్రజానీకం మాత్రం అందాల భామలను చూసేందుకు వేయి కళ్లతో నిరీక్షిస్తున్నారు.



**- జి.లక్ష్మణ్ కుమార్,**
**అసిస్టెంట్ డైరెక్టర్**
**సమాచార, పౌర సంబంధాల శాఖ**

## వరంగల్ పర్యటన వివరాలు..

- హైదరాబాదు నుంచి ఈ నెల 14న సాయంత్రం 4:35 గంటల హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్ కు చేరుకుంటారు.
- 5:45 గంటలకు చారిత్రక వేయి స్తంభాల దేవాలయ సందర్శన
- 6:25 గంటలకు అక్కడినుంచి బయలుదేరి 6:40 వరంగల్ ఫోర్ట్ కు చేరుకుంటారు.
- 7:35 గంటల వరకు అక్కడే గడుపుతారు
- అనంతరం 7:55 గంటలకు హరిత కాకతీయ హోటల్ కు చేరుకుంటారు.
- రాత్రి డిన్నర్ అనంతరం 9 గంటలకు హైదరాబాద్ కు బయలుదేరుతారు.

## రామప్ప పర్యటన వివరాలు..

- 14 న హైదరాబాద్ నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు ములుగులోని హరిత హోటల్ కు చేరుకుంటారు.
- 4:30 కి సాంప్రదాయ వస్త్రాల్లో రామప్ప దేవాలయ దర్శనం
- 5:00 గంటలకు దేవాలయ ప్రాంగణంలో నిర్వహించనున్న సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తారు.

# పేదల ఇండ్ల స్థలాలకు ఇంకెన్నాళ్లీ నిరీక్షణ

- స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలి
- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** పేదలు ఇండ్ల స్థలాల కోసం ఇంకెన్నాళ్లు నిరీక్షించాలని, పేదలు వేసుకున్న గుడిసెలకు ఇంటి స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు కట్టించాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం హనుమకొండ మండలంలోని గుండ్ల సింగారంలో సీపీఐ ఆధ్వర్యంలో వేసుకున్న గుడిసెల కేంద్రం వద్ద పార్టీ ఆఫీస్ కార్యాలయానికి సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు శంకుస్థాపన చేశారు. అనంతరం గుడిసె వాసుల సమావేశం సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి అధ్యక్షతన జరగగా ముఖ్య అతిథిగా హాజరైన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్లపల్లి శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడుతూ ఇండ్ల స్థలాల కోసం, పక్కా ఇండ్ల నిర్మాణం కోసం ఏండ్ల తరబడి పేదలు పోరాడుతూనే ఉన్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. స్వాతంత్రం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా పేదలు, బడుగు బలహీన వర్గాలు నివసించేందుకు స్థలం లేక, పక్కా ఇల్లు లేక, దుర్భర జీవితం గడుపుతున్నారని అన్నారు. అయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయలేని పరిస్థితి దాపురించిందని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం పేద ప్రజలకు ఇళ్లస్థలంతో పాటు పక్కా ఇల్లు నిర్మిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని, కానీ ఇంకా రాష్ట్ర ప్రభుత్వం దీనిని అమలు చేయడంలో నిర్లక్ష్యం చేస్తున్నదని అన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి పేద ప్రజలను ఆదుకోవాలని కోరారు. పేదలకు, ప్రభుత్వ భూములలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న వారికి ఇండ్ల స్థలాలు ఇచ్చి ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, జిల్లా సహాయ కార్యదర్శి తోట భిక్షపతి, సీనియర్ నాయకులు మోతె లింగారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ఎన్ ఎ స్టాలిన్, జిల్లా నాయకులు బత్తిని సదానందం, మెట్టు శ్యాంసుందర్ రెడ్డి, కొట్టేపాక రవి, మండల సహాయ కార్యదర్శి గుంటి రాజేందర్, గ్రామ పెద్దలు గాదె రాజన్న, గాదె మొగిలి, కట్కూరి కృష్ణ, నాయకులు పోనుగోటి రాము, పూజారి అమృతయ్య, పూజారి నరేందర్, గడ్డం గోవర్ధన్, రామక్రిష్ణ, శ్రావ్య, ముప్పుడి రజిత, సునీత, గుడిసె వాసులు తదితరులు పాల్గొన్నారు.

# శిథిలావస్థలో ఉన్న స్తంభాలను తొలగించాలి



**వరంగల్ వాయిస్, కరీమాబాద్ :** వర్షాకాలం రాకముందే డివిజన్లోని పాతకాలం నాటి ఇనుప కరెంటు స్తంభాలను, వంగిన సిమెంటు స్తంభాలను తొలగించి వాటి స్థానంలో కొంత కరెంట్ పోల్స్ వేయాలని 40వ డివిజన్ కార్పొరేటర్ మరుపల్ల రవి అన్నారు. రంగశాయిపేట ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ అసిస్టెంట్ డైరెక్టర్ ఇంజనీర్ చంద్రమౌళి ఆదేశానుసారం కరీమాబాద్ ఎలక్ట్రికల్ సబ్ స్టేషన్ ఏఈడీ సంపత్, కార్పొరేటర్ మరుపల్ల రవితో కలిసి సబ్ స్టేషన్ పరిధిలో ఉన్న డివిజన్ లో పర్యటించి శిథిలావస్థలో ఉన్న 18 స్తంభాలను గుర్తించడం జరిగింది. గాలి దుమారం, వర్షం వల్ల తీగలు ఇనుప కరెంటు స్తంభాలను తాకి ఇనుప స్తంభాలకు కరెంటు సరఫరా అవుతున్నందున కొంతమందికి కరెంట్ షాక్ తగిలి ఆసుపత్రి పాలయ్యారని మరుపల్ల రవి తెలిపారు. ఎలక్ట్రికల్ ఏఈ సంపత్ మాట్లాడుతూ డివిజన్ లో ఇనుప స్థంభాలు పూర్తిగా క్షీణ దశలో ఉన్నాయని, వీటిని తొలగించకుంటే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నందున ఎలక్ట్రికల్ ఉన్నతాధికారులకు తెలియపరచి త్వరగా కరెంటు స్తంభాలు వేయుటకు తాను శ్రద్ధ చూపిస్తానన్నారు. ఎలక్ట్రికల్ లైన్ ఇన్ స్పెక్టర్ సీహెచ్ భద్రయ్య, లైన్ మెన్ సాంబయ్య ఉన్నారు.

# కుట్టు శిక్షణ కేంద్రం ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, రాయపర్తి :** వరంగల్ జిల్లా రాయపర్తి మండలం ఊకల గ్రామంలో సిరి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ కేంద్రాన్ని రాజేందర్ గారు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ డాక్టర్ పరికి సుధాకర్, ప్రతినిధులు ఎంఏ మహమ్మద్ పాషా, విజయ, శిక్షకురాలు శోభారాణి పాల్గొన్నారు. అలాగే గ్రామంలోని మహిళలు శోభ, కవిత, అనూష, రాధిక, శిరీష, సరస్వతి, మానస, లక్ష్మి, మేఘనా, సుమతి, విజయ తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ మహిళలు ప్రతిరోజూ రెండు గంటల పాటు శిక్షణలో పాల్గొని, రెండు నెలల్లో కోర్సును పూర్తి చేయాలని సూచించారు. మహమ్మద్ పాషా గారు మాట్లాడుతూ, ఈ శిక్షణ ద్వారా మహిళలు కట్టడంలో సాంకేతికత, కొలతలతో కూడిన ప్రమాణాలను నేర్చుకుంటే, అది వారి కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంలో సహాయపడుతుందని తెలిపారు. టీచర్ ఇచ్చే సూచనల ప్రకారం కటింగ్, కుట్టడాన్ని క్రమంగా నేర్చుకోవాలని సూచించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న రాజేందర్ మాట్లాడుతూ ఈ గ్రామానికి శిక్షణ కేంద్రాన్ని తీసుకువచ్చిన సిరి స్వచ్ఛంద సంస్థకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలోని మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, స్వయం ఉపాధిని సాధించేందుకు ముందుకు రావాలని సూచించారు. మంచి శిక్షణతో బట్టలు కట్టి, గిరాకీ పెరిగేలా చేసి, స్వయం ఆధారంగా ఎదిగే మార్గం ఏర్పడుతుందని చెప్పారు.ఇది సిరి సంస్థ ఏర్పాటు చేసిన 32వ కుట్టు శిక్షణ కేంద్రంగా గుర్తింపు పొందింది. కార్యక్రమ ముగింపులో మహిళలందరికీ స్వీట్లు పంపిణీ చేశారు.

# హనుమాన్ స్వాములకు అన్నదానం



**వరంగల్ వాయిస్, న్యూ శాయంపేట :** నగరంలోని 31వ డివిజన్ న్యూ శాయంపేటలోని శ్రీ భక్తాంజనేయ హనుమాన్ మాలధారణ స్వాముల 41 రోజులు నిత్య అన్నదాన కార్యక్రమంలో భాగంగా మంగళవారం సుమారు 600 హనుమాన్ మాలధారణ స్వాములకు అన్నదాన కార్యక్రమానికి శ్రీ శ్రీనివాస కిడ్నీ సెంటర్ ప్రొఫెసర్ డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాములు మాట్లాడుతూ హనుమాన్ దీవెనలు వారికి వారి కుటుంబ సభ్యులకు ఎల్లవేళలా ఉంటాయని వారి కిడ్నీ సెంటర్ సేవలు ప్రజలు వినియోగించుకోగలరని మరెన్నో ఉన్నంత సేవలందించాలని కోరారు. 41 రోజులు అన్నదాన కార్యక్రమానికి సహాయక సహకారాలను అందిస్తున్న ప్రతి ఒక్కరికి హనుమాన్ దీవెనలు ఉంటాయని మరి ఎవరైనా దాతలు ఉంటే మాకు సహకరించగలరని కోరారు. అనంతరం డాక్టర్ రాంప్రసాద్ రెడ్డి భక్తాంజనేయ కుటీరం హనుమాన్ మాల ధారణ స్వాముల మడిశెట్టి శ్యామ్, అనిల్, యాదగిరి, సురేందర్, రమేష్, చిరంజీవి, శివ, భిక్షపతి ఆశీర్వదించారు.

# కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి స్థలాన్ని ఇవ్వండి



**వరంగల్ వాయిస్, జయశంకర్ భూపాలపల్లి :** జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయానికి అవసరమైన స్థలాన్ని ఇవ్వాలని కోరుతూ మంగళవారం జిల్లా అడిషనల్(రెవెన్యూ) కలెక్టర్ అశోక్ కుమార్ కు వినతి పత్రాన్ని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డితో కలిసి భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ రాష్ట్ర, జిల్లా, పట్టణ నాయకులు పాల్గొన్నారు.

# పాలిసెట్ పరీక్ష ప్రశాంతం



**వరంగల్ వాయిస్, వరంగల్ :** పాలిసెట్ – 2025 పరీక్ష వరంగల్ జిల్లాలో శాంతియుత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా విజయవంతంగా ముగిసిందని జిల్లా కోఆర్డినేటర్ డా. బైరీ ప్రభాకర్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన అందించిన సమాచారం మేరకు జిల్లాలోని మొత్తం 12 పరీక్ష కేంద్రాల్లో ఈ పరీక్ష జరిగిందని మొత్తం 6424 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 5941మంది హాజరయ్యారని తెలిపారు.అబ్బాయిలలో 3476 మంది దరఖాస్తు చేసుకుని 3218 మంది హాజరుకాగా, అమ్మాయిల్లో 2948 మంది దరఖాస్తు చేసుకుని 2723 మంది హాజరయ్యారని మొత్తం హాజరు శాతం 92.48 శాతంగా నమోదైందని అన్నారు. ఈ పరీక్షను పర్యవేక్షించేందుకు రాష్ట్ర సాంకేతిక విద్యా మండలి (ఎస్ బీటీఈటీ) తరపున గుగులోతు రాములు ప్రత్యేక పర్యవేక్షకుడిగా నియమితులయ్యారు. హనుమకొండ జిల్లాలో పరీక్షల నిర్వహణను సమర్థవంతంగా నిర్వహించేందుకు బి.మనోజ్ కుమార్ (ఎంఈఓ, కాజీపేట), స్పెషల్ స్క్వాడ్ సభ్యురాలిగా సంగీత, నాయబ్ తహసీల్దార్, ఎస్సై సదానందం బాధ్యతలు నిర్వహించారు. పరీక్ష విజయవంతంగా నిర్వహించడంలో సహకరించిన జిల్లా అధికారులు, విద్యా సంస్థల ప్రిన్సిపాళ్లు, డీఈఓ కార్యాలయం, టీఎస్ ఎస్పీడీసీఎల్, టీజీఆర్టీసీ, డీఎంహెచ్ఓ, జీడబ్ల్యూఎంసీ, ఇతర కమిటీలకు, అసిస్టెంట్ కోఆర్డినేటర్ ఎం.వెంకన్నకు డా.బైరీ ప్రభాకర్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలి

- తాటిపాముల వెంకట్రాములు




**వరంగల్ వాయిస్, వరంగల్ :** మే 20వన దేశవ్యాప్తంగా వ్యవసాయ కార్మికులు, కర్షకులు, సంఘటిత, అసంఘటిత కార్మికుల హక్కుల సాధన కోసం చేపడుతున్న సార్వత్రిక సమ్మె, గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలని భారతీయ ఖేత్ మజ్దూర్ యూనియన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు తాటిపాముల వెంకట్రాములు పిలుపునిచ్చారు. మంగళవారం శివనగర్ తమ్మెరభవన్‌లో నిర్వహించిన వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యవర్గ సమావేశానికి సిలువేరు విజయ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా పాల్గొన్న వెంకట్రాములు ప్రసంగిస్తూ “78 ఏళ్ల స్వాతంత్ర పాలనలో కూడా రైతులు, కూలీల పరిస్థితి ఏమీ మారలేదని,” ఆవేదన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారీ శక్తులకు అనుకూలంగా నడుస్తున్న పాలకులు కష్టజీవుల హక్కులను కాలరాస్తున్నారని విమర్శించారు. వ్యవసాయ కార్మికుల కోసం సమగ్ర సంక్షేమ చట్టం ఏర్పాటు, ఉపాధి హామీ కింద సంవత్సరానికి 200 రోజుల పని కల్పన, రోజుకు కనీసం ₹700 కూలీ చెల్లింపు, పట్టణాల్లో కూడా ఉపాధి హామీ పనుల అమలు, రైతు పంటలకు గిట్టుబాటు ధర లభించే విధంగా చర్యలు, కార్మికులకు వ్యతిరేకంగా తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్‌ను రద్దు చేసి పాత కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి, కనీస వేతనం ₹26,000గా నిర్ధారణ, సమాన పనికి సమాన వేతనం అమలు, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను అడ్డుకోవాలి, ఉద్యోగ భద్రత హామీ పలు డిమాండ్ల సాధనకు ఈ సమ్మెలో అన్ని వర్గాల ప్రజలు పాల్గొని కార్మికుల ఐక్యతను ప్రదర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కపల్లి రమేష్, సిలువేరు విజయ, బి. సాయిలు, వేముల బాబు, వి. ఎల్లయ్య, సాంబలక్ష్మి, స్వరూప తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబాలకు ఝాన్సీ రెడ్డి పరామర్శ



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** మండలంలోని చర్లపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ కార్యకర్త పైండ్ల కేశమల్లు ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఝాన్సీ రాజేందర్ రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చీకటయపాలెం గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పడకంటి వెంకటయ్య, వడిచర్ల సోమరాములు ఇటీవల మృతిచెందగా విషయం తెలుసుకున్న వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మంగళపల్లి మాల్సూర్ కు ఆక్సిడెంట్ కాగా పరామర్శించారు. ఝాన్సీ రాజేందర్ రెడ్డి వెంట బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు హమ్య నాయక్, మండల అధ్యక్షుడు ఎస్.సంతోష్, వర్కింగ్ ప్రెసిడెంట్ మేకల కుమార్, నాయకులు ప్రసాద్ రెడ్డి, విజయ పాల్ రెడ్డి, పెదగాణి సోమయ్య, పొనుగోటి సోమేశ్వర్ రావు, సోమన్న, బాపూరెడ్డి, దేవేందర్ రెడ్డి తదితరులు ఉన్నారు.

# డాక్టర్ శ్రీకాంత్ బాధ్యతల స్వీకరణ



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ విశ్వవిద్యాలయ సివిల్ ఇంజినీరింగ్ విభాగ పాఠ్య ప్రణాళిక అధ్యక్షుడిగా, వరంగల్ కాకతీయ ఇన్‌స్టిట్యూట్ అఫ్ టెక్నాలజీ అండ్ సైన్సు (కిట్స్) కాలేజీ సివిల్ ఇంజినీరింగ్ విభాగ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.శ్రీకాంత్ ను నియమిస్తూ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం ఉత్తర్వులు జారీ చేశారు. డాక్టర్ శ్రీకాంత్ ప్రస్తుత చైర్ పర్సన్ డాక్టర్ సీహెచ్.రాధిక నుంచి బాధ్యతలు స్వీకరిస్తారు. పలువురు బోధనా, బోధనేతర సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు డాక్టర్ ఎం.శ్రీకాంత్ ను అభినందించారు.

# వద్దిరాజు వెంకటనర్సమ్మకు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, ఖమ్మం :** రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర మాతృమూర్తి వెంకటనర్సమ్మకు తన కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నివాళులర్పించారు. వెంకటనర్సమ్మ 11వ వర్ధంతి (తద్దినం) సందర్భంగా స్వగ్రామం ఇనుగుర్తిలో మంగళవారం ఆమె కుమారులు కిషన్, దేవేందర్, రవిచంద్ర, వెంకటేశ్వర్లు ప్రత్యేక పూజలు చేసి పిండ ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వద్దిరాజు సోదరులు తమ తల్లిదండ్రులు నారాయణ–వెంకటనర్సమ్మల జ్ఞాపకార్థం నెలకొల్పిన స్మృతివనాన్ని సందర్శించి కుటుంబ సభ్యులతో కలిసి వారి విగ్రహాలకు పూలుజల్లి, కొబ్బరికాయలు కొట్టి ఘనంగా నివాళులర్పించారు,గత స్మృతులను నెమరు వేసుకున్నారు స్మృతివనాన్ని వద్దిరాజు కమలమ్మ, వద్దిరాజు కిషన్–శశిరేఖ ,వద్దిరాజు దేవేందర్ –ఇందిర, వద్దిరాజు రవిచంద్ర –విజయలక్ష్మీ,వద్దిరాజు వెంకటేశ్వర్లు–ఉమా మహేశ్వరి,వద్దిరాజు మోహన్ –వాసవి,వద్దిరాజు వెంకటేశ్వర్లు(పోలీస్) –పద్మ,వద్దిరాజు శ్రీనివాస్,వద్దిరాజు నాగరాజు,వద్దిరాజు శ్రీనివాస్ (గడ్డి), శీలం సత్యనారాయణ–లక్ష్మీ, సంగిశెట్టి సోమయ్య, సంగిశెట్టి శంకర్, సంగిశెట్టి ప్రభాకర్,ఆకుల గాంధీ,ఆకుతోట ఆదినారాయణ,వనం నాగయ్య సందర్శించి నారాయణ–వెంకటనర్సమ్మ విగ్రహాలకు పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. తమ తల్లి తద్దినం (వర్ధంతి) సందర్భంగా వద్దిరాజు సోదరులు పలువురు బ్రాహ్మణులకు నిత్యావసర సరుకులు, కొంత నగదు అందజేసి గౌరవించారు. సుమారు 1,000మంది పేదలకు అన్నదానం చేశారు.

# అర్హతలు ఉన్నవారికే పదవులు వస్తాయి

## ■ ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి తగిన గుర్తింపు లభిస్తుందని, పైరవీలతో పదవులు రావని, అర్హతలు ఉన్న వారికే పదవులు వస్తాయని భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు అన్నారు. మంగళవారం భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో భూపాలపల్లి మండల అధ్యక్షుడు రామచంద్రయ్య అధ్యక్షతన జరిగిన సంస్థాగత నిర్మాణ సన్నాహక సమావేశానికి ముఖ్య అతిథులుగా భూపాలపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డి, భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు, సంస్థాగత ఎన్నికల జిల్లా పరిశీలకులు ఇనగాల వెంకట్రామ్ రెడ్డి, మాసంపెల్లి లింగాజి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు మాట్లాడుతూ.. క్షేత్ర స్థాయి నుంచి పార్టీ నిర్మాణంలో సామాజిక న్యాయం పాటించడం ద్వారా ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుద్దామని కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షీ నటరాజన్ అన్నారని ఈ సందర్భంగా ఎమ్మెల్యే గుర్తు చేశారు. సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణే.. కాంగ్రెస్ సిద్ధాంతమని ఈ సందర్భంగా తెలిపారు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు పార్టీ ప్రక్షాళనలో పీసీసీ పరిశీలకుల బాధ్యత అత్యంత కీలకమైందన్నారు. పార్టీ సంస్థాగత నిర్మాణంలో చిత్తశుద్ధితో పని చేయాలని ఎమ్మెల్యే సూచించారు. త్వరలోనే స్థానిక ఎన్నికలు జరగబోతున్నాయని, కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ పదవులు రాబోతున్నట్లు గుర్తుచేశారు.

# సీనియర్ జర్నలిస్టులకు సన్మానం




**వరంగల్ వాయిస్, కమలాపూర్ :** హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో ప్రముఖ న్యాయవాది పుల్ల ప్రవీణ్ కుమార్ తన న్యాయవాద వృత్తిలో 15 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా సీనియర్ జర్నలిస్టును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, స్థానిక ప్రముఖులు హాజరయ్యారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న సీనియర్ జర్నలిస్టులు పులికంటి రాజేందర్, మిట్టపల్లి ప్రభాకర్, గాజుల సతీష్ మాట్లాడుతూ పాత్రికేయులు సమాజానికి దర్పణం వంటివారన్నారు. ప్రజల సమస్యలను ప్రభుత్వానికి తెలియజేసే వాణిగా జర్నలిస్టుల బాధ్యత ఎంతో గౌరవప్రదమైనది. ప్రత్యేకించి తెలంగాణ ఉద్యమంలో పాత్రికేయులు పోషించిన పాత్ర మరువలేనిది. న్యాయవాద వృత్తిలో 15 ఏళ్ల సేవ పూర్తి చేసుకున్న పుల్ల ప్రవీణ్ కుమార్, పేదలకు న్యాయ సహాయం అందిస్తూ ముందుకు సాగాలని కోరుకుంటున్నాను అని తెలిపారు. అంతేకాకుండా, పత్రికా రంగం సేవలను అభినందిస్తూ ఇలాంటి సన్మాన కార్యక్రమాలు మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయని, జర్నలిస్టులకు మానవతా సేవలలో భాగస్వామ్యంగా ఉండాలని సీనియర్ జర్నలిస్ట్ పులికంటి రాజేందర్ అన్నారు. కమలాపూర్‌లోని ఈ కార్యక్రమంలో జర్నలిస్టులు మిట్టపల్లి ప్రభాకర్, గాజుల సతీష్, పబ్బు సతీష్, మౌటం కుమారస్వామి, బాలసాని దేవేందర్, మిట్టపల్లి కుమార్, మోడెం రాజ్ కుమార్, గట్టు రఘు, పులి కంటి ప్రభాకర్, తల్లా శ్రీనివాస్, మునీందర్, డేవిడ్ పాల్గొన్నారు.



# ఆటో డ్రైవర్లకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలి



**వరంగల్ వాయిస్, వరంగల్:** ఆటో కార్మికుల సంక్షేమం కోసం మే 20న నిర్వహించనున్న దేశవ్యాప్తంగా సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని కోరుతూ వరంగల్ నోబుల్ ఫంక్షన్ హాల్‌లో ఆటో కార్మిక సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో తాడు సంఘం ప్రతినిధి రవి, ఏఐటీయూసీకి చెందిన గన్నారపు రమేష్, ఆటో అండ్ ట్రాలీ వర్కర్స్ యూనియన్‌కి చెందిన ఎండీ మహబూబ్ పాషా, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్, కార్యదర్శి ముక్కెర రామస్వామి తదితరులు పాల్గొన్నారు. సమ్మెకు వరంగల్ జిల్లా ఆటో కార్మికులంతా భాగస్వాములవుతామని, ప్రతి ఆటో స్టాండ్ వద్దకు వెళ్లి సమ్మె ప్రాధాన్యతను వివరించామని, సమ్మె విజయవంతం కావడానికి అన్ని విధాల సహకరించనున్నట్లు వారు తెలిపారు. బీజేపీ ప్రభుత్వం రవాణా రంగాన్ని కార్పొరేట్ శక్తులకు అప్పగించే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు అమలుచేయాలని, తక్షణమే నాలుగు కొత్త లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని, మహాలక్ష్మి పథకం ద్వారా నష్టపోతున్న డ్రైవర్లకు నెలకు రూ.4,500 పెన్షన్ అందించాలని, 10 లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యాన్ని కల్పించాలని, రవాణా కార్మికులకు ఈఎస్ఐ, పీఎఫ్ సదుపాయాలు వర్తింపజేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సలీం, షేక్ మదర్, షేక్ లతీఫ్, ఎండీ గఫూర్, ఎండీ హంజత్, సుమంత్ శ్రీనివాస్, యాకు పాషా, కనుక స్వామి దేవేందర్, జానీ, ఎండీ హమీద్, ఎస్ కె దస్తగీర్, ఇమ్రాన్, వెంకట్ నారాయణ, యాదవ్, వహీద్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# పథకాల వెరిఫికేషన్ వేగంగా జరగాలి

## ◆ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** ఇందిరమ్మ ఇల్లు, రాజీవ్ యువ వికాసం పథకానికి సంబందించిన లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ మీద అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ కలెక్టరెట్ లోని వీడియో కాన్ఫెరెన్స్ హల్ నుంచి అన్ని మండలాల స్పెషల్ అధికారులతో, మున్సిపల్ కమిషనర్లతో, హౌసింగ్ పీడీ, బీసీ, ఎస్సీ సంక్షేమ అధికారులు, ఎస్సీ కార్పొరేషన్, ఎల్ డీఎం, అన్ని మండలాల ఎంపీడీవోలు, క్షేత్రస్థాయిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల వెరిఫికేషన్ ప్రక్రియను చేస్తున్న అధికారులతో మంగళవారం కలెక్టర్ జూమ్ మీటింగ్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇప్పటివరకు ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించిన లబ్ధిదారుల వెరిఫికేషన్ మండలాల వారీగా ఎంత మేరకు జరిగిందని, క్షుణ్ణం గా వివరాలు అడిగారు. అలాగే, వెరిఫికేషన్ అయిన వాటిలో ఎన్ని దరఖాస్తు లను ఆన్ లైన్ లో నమోదు చేశారని అడిగి త్వరగా పూర్తి చేయాలనీ ఆదేశించారు. రాజీవ్ యువ వికాసం పథకానికి సంబంధించి కలెక్టర్ మాట్లాడుతూ బీసీ, ఎస్సీ, మైనారిటీ, ట్రైబల్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ అధికారులతో సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ వివరాలని అడిగి తెలుసుకున్నారు. యూనిట్ ల వారీగా ఉన్న లక్ష్యంకు సంబంధించి వచ్చిన దరఖాస్తులలో ఎంత మందివి సిబిల్ స్కోర్ చెక్ చేశారు. ఇంకా ఎంత మందివి చేయాలి. సిబిల్ స్కోర్ వెరిఫికేషన్ పూర్తి అయిన దరఖాస్తులలో ఎంత మందిని అర్హులుగా గుర్తించ్చారో వెంటనే నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సంక్షేమ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ వేగవంతం గా పూర్తి చేసి అర్హులకి సంక్షేమ ఫలాలను అందించాలన్నారు.

# అంతా మిలాఖత్..!

- మిల్లర్లు, మహిళా సంఘాల అక్రమాలు
- అన్నదాతల నిలువు దోపిడీ
- నిబంధనల కంటే ఎక్కువ తూకం
- బస్తాకు కేజీ అదనంగా దండుకుంటున్న వైనం




**వరంగల్ వాయిస్, దామెర :** ఆరుగాలం కష్టపడి పండించిన పంటను అమ్ముకునే వేళ కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు, మిల్లర్లు అక్రమాలకు పాల్పడు తున్నారు. నారు నాటింది మొదలు చేతికి వచ్చే వరకు పంటను కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్న రైతున్నకు కొనుగోలు వేలా కష్టాలు తప్పడం లేదు. హనుమకొండ జిల్లా దామెర మండల పరిధిలోని వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. కాగా ప్రతీ కొనుగోలు కేంద్రంలో తరుగు పేరిట ఇబ్బందులకు గురిచేస్తున్నారని రైతులు వాపోతున్నారు దేశానికే వెన్నెముకగా రైతును భావిస్తారు. అలాంటిది అ రైతును నిలువునా దోపిడీ చేయడం గమనార్హం.

### తూకంలో మోసం..

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఒక బస్తాకు 40.500 గ్రాములు తూకం వేయాల్సి ఉంది. కానీ కొనుగోలు కేంద్రాల్లో 41.600 గ్రాములు తూకం వేస్తున్నారని సమాచారం. దీంతో రైతు భారీగా నష్టపోవాల్సి వస్తోంది. దీనిపై అధికారులు నిఘా పెట్టి మేలు చేకూరేలా చర్యలు చేపట్టాలని పలువురు కోరుతు న్నారు.

### జాడలేని అధికారులు ..

కొనుగోలు కేంద్రాల్లో తనిఖీలు చేపట్టల్సిన అధికారులుప్రస్తుతం పట్టించుకోకపోవడంతో మహిళా సంఘాలు, రైస్ మిల్లర్లు రాజ్యమేలుతున్నారు. రైతును అందినకా డికి దోచుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయి. మండల కేంద్రంలో రైతులు మరిన్ని ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ ఆరికారుల పర్యవే క్షణ లేకపోవడంతో రైతులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటు న్నారు. రైతులు ప్రశ్నిస్తే మీ ధాన్యంలో తేమ ఎక్కువగా ఉంది ఇంకా ఆరబెట్టాలని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### రైతులకు మద్దతుగా చర్యలేవీ..

రైతుల కన్నీరు తుడిచేలా, పాలకులు వెంటనే స్పందించి కొనుగోలు కేంద్రాల్లో పారదర్శకత తీసుకురావాలి. తూకం మోసాలపై నిఘా పెట్టి, సంబంధిత బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని వ్యవసాయ విశ్లేషకులు సూచిస్తున్నారు.







# ఎయిడ్స్ బాధితులకు మెరుగైన వైద్య సేవలు



- డీఎంహెచ్ఓ డాక్టర్ సాంబశివరావు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** హెచ్ఐవీతో జీవిస్తున్నవారికి మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలని వరంగల్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ సాంబశివరావు ఆదేశించారు. మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో ఎయిడ్స్ పై డీఎంహెచ్ఓ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంభశివరావు మాట్లాడుతూ జిల్లా హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ సంస్థ ఆధ్వర్యంలో వరంగల్, హనుమకొండ, జనగాం జిల్లాలోని ఐసీటీసీ, పీపీటీసీ, ఏఆర్టీ, డీఎస్ఆర్ సీ, టీఐఎన్జీఓస్ ద్వారా గత సంవత్సరంలో చేసిన హెచ్ఐవీ పరీక్షలు, కనుగొనబడిన హెచ్ఐవీ పాజిటివ్ కేసులు యొక్క అంశాలను చర్చించి 114శాతం సాధించిన వరంగల్ జిల్లా కౌన్సిలర్స్, స్వచ్ఛంద సంస్థలను అభినందించారు. సరి అయిన అవగాహనా తోటే హెచ్ఐవీని నిర్మూలించగలం అన్నారు. ప్రతి ఒక్క ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కూడా హెచ్ఐవీ పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు. హెచ్ఐవీతో జీవిస్తున్న ప్రతీ ఒక్కరు ఏఆర్టీ మందులను తప్పనిసరిగా వాడే విధంగా చూడాలన్నారు. ఇందుకు స్వచ్ఛంద సంస్థలు బాధ్యతతో పనిచేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో వరంగల్ జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఆచార్య, హనుమకొండ డీటీసీఓ డాక్టర్ హిమబిందు, ఏఆర్టీ సీనియర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సూర్య ప్రకాష్, ఉమ్మడి జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ స్వప్న మాధురి, డిప్యూటీ డెమో అనిల్ కుమార్, ఐసీటీసీ సూపర్ వైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# ఫార్మసీ ఆఫీసర్ల సమస్యలు పరిష్కరించాలి

**తెలంగాణ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో ప్రభుత్వ రంగంలో పని చేస్తున్న ఫార్మసీ ఆఫీసర్ల సమస్యలు అనేక సంవత్సరాలుగా పరిష్కారాల కోసం వేచి ఉన్నట్లు తెలంగాణ గవర్నమెంట్ ఫార్మసీ ఆఫీసర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన త్రిసభ్య ఐఏఎస్ కమిటీకి సంఘం వినతిపత్రం సమర్పించింది. ఫార్మసీ ఆక్ట్ 1948, సెక్షన్ 42 అమలు చేసి అన్ని ప్రభుత్వ ఆరోగ్య సంరక్షణ కేంద్రాల్లో ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలన్నారు. బస్తీ దవాఖానాలు, పల్లె దవాఖానాలు, ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కనీసం ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్లను నియమించాలి, జిల్లా స్థాయిలో ఆరోగ్య శాఖకు చెందిన అన్ని ఫార్మసీ స్టోర్స్, మలేరియా, లెప్రసీ, టీ.బి స్టోర్స్‌లో అవసరమైన పోస్టులను మంజూరు చేయాలి, టీచింగ్ ఆసుపత్రుల్లో సీనియర్ ఫార్మసీ ఆఫీసర్, జిల్లా ఫార్మసీ ఆఫీసర్, ఫార్మసీ ఆఫీసర్ల పోస్టులను విస్తరించాలి, సీనియార్టీ ప్రకారం 13 సంవత్సరాలు సేవ పూర్తి చేసిన ఫార్మసీ ఆఫీసర్లకు ప్రమోషన్లు కల్పించాలి, ప్రతి ఫార్మసీ ఆఫీసర్‌కు కనీసం మూడు ప్రమోషన్లు లభించే విధంగా ప్రణాళిక రూపొందించాలి, విద్యార్హతల ఆధారంగా డైటీషియన్, డ్రగ్స్ ఇన్స్పెక్టర్, డ్రగ్స్ అనలిస్ట్ వంటి పోస్టులకు అవకాశం కల్పించాలి, రాష్ట్ర స్థాయిలో



ప్రత్యేక ఫార్మసీ డైరెక్టరేట్ ఏర్పాటు చేసి, డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ పోస్టులను ప్రవేశపెట్టాలి, క్లినికల్ ఫార్మసీ విభాగాలను టీచింగ్ ఆసుపత్రుల్లో ప్రారంభించి, తగిన అర్హతలతో ఫార్మసీ ప్రొఫెషనల్స్‌ను నియమించాలి, డీఎంఈ పరిధిలో ముగ్గురు ఫార్మసీ ఆఫీసర్లు ఉన్న ఆసుపత్రుల్లో ఒక సీనియర్ ఫార్మసీ ఆఫీసర్‌ను నియమించాలనే డిమాండ్లన్నీ ప్రభుత్వానికి సమర్పించినట్లు అసోసియేషన్ స్టేట్ ప్రెసిడెంట్ బత్తిని సుదర్శన్ గౌడ్, వర్కింగ్ ప్రెసిడెంట్ కందకట్ల శరత్ బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ జాలిగామ అశోక్ తెలిపారు. ఫార్మసీ రంగ అభివృద్ధి కోసం ఈ సమస్యలపై కమిటీ హృదయపూర్వకంగా స్పందించి, వీలైనంత త్వరగా పరిష్కారం చూపాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

# డ్రంకెన్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్, ట్రాఫిక్ ఏసీపీ టి.సత్యనారాయణ పర్యవేక్షణలో డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన(37) మంది వ్యక్తులను మేజిస్ట్రేట్ అబ్బోజు వేంకటేశం ఎదుట హాజరు పరచగా గుండె కరుణాకర్, చిక్కుడు సమ్మయ్య, బోడకుంట్ల విద్యాసాగర్, పల్లకొండ రాజేందర్ లకు రెండు రోజుల జైలు శిక్ష పడగా హుజురాబాద్ సబ్ జైలు కు తరలించి, మిగతా 33 మందికి రూ.39,000 జరిమానా విధించారు. డ్రైవింగ్ లైసెన్సు లేకుండా వాహనాలు నడిపిన వ్యక్తులను కోర్టులో హాజరు పర్చగా వారికి రూ.500రూపాయల జరిమానా ను విధించినట్లు వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. రామకృష్ణ తెలిపారు.

# కళాశాలలో సైన్స్ అధ్యాపకుల భర్తీపై ఎమ్మెల్యేకు వినతి




**వరంగల్ వాయిస్, ఆత్మకూరు :** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సైన్స్ సెక్షన్ లో అధ్యాపకుల భర్తీ చేపట్టాలని పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డిని కళాశాల ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మంగళవారం కలిసివినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ నరసింహారెడ్డి మాట్లాడుతూ గత కొంతకాలంగా సైన్స్ సంబంధించిన అధ్యాపకుల కొరత ఉందని విద్యార్థుల సౌకర్యార్థం సైన్స్ అధ్యాపకుల భర్తీని చేపట్టాలని ఆయన కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందించి సైన్స్ ఆధ్యాపకుల భర్తీకి చర్యలు తీసుకుంటామని కళాశాల ప్రిన్సిపాల్ కు హామీ ఇచ్చారు. ఆత్మకూరు జూనియర్ కళాశాలలో ప్రతి ఏటా విద్యార్థుల శాతం గణనీయంగా పెరగడంతో పాటు పరీక్షల ఫలితాల్లో విద్యార్థులు రాణిస్తున్నారని మంచి ర్యాంకులు సాధిస్తున్నారని ఆయన తెలియజేశారు.

# భక్తాంజనేయ స్వామి దేవస్థానంలో అన్న ప్రసాద వితరణ



**వరంగల్ వాయిస్, పరకాల :** మండలంలోని మల్లక్కపేట భక్తాంజనేయ స్వామి ఆలయ చైర్మన్ అంబీరు మహేందర్ ఆధ్వర్యంలో మంగళవారం ఆలయంలో మల్లక్కపేట గ్రామానికి చెందిన బొజ్జం కవిత–కిషన్ దంపతులు స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం మాల ధారణ స్వాములకు అన్న ప్రసాదం వితరణ చేశారు. దీక్షా స్వాములచే ఆలయం శ్రీరామ నామంతో మార్మోగింది. ఈ కార్యక్రమంలో పరకాల ఏఎంసీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి, ఈఓ వెంకటయ్య, ప్రధాన అర్చకులు కాటూరి జగన్నాధా చార్యులు, డైరెక్టర్స్ దొమ్మటి శంకరయ్య, నిట్టె బాలరాజు, బొజ్జం రాజేం దర్, నల్ల విష్ణువర్ధన్ రెడ్డి, దీక్ష స్వాములు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ పట్టాభి సీతారామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, గణపురం :** మండల కేంద్రంలోని శ్రీ పట్టాభి సీతారామచంద్రస్వామి ఆలయంలో మంగళవారం వైశాఖ బహుళ పాడ్యమి సందర్భంగా స్వామివారికి ఆలయ అర్చకులు ముసునూరి నరేష్ ప్రత్యేక పూజా కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అదేవిధంగా గణపురం మండల కేంద్రానికి చెందిన హనుమాన్ మాల ధారణ స్వాములు ఆలయ ప్రాంగణంలో కొలువుదీరిన ఆంజనేయ స్వామి కి పంచామృతాలతో అభిషేకం, చందనాభిషేకం నిర్వహించి స్వామివారిని తమలపాకులతో రకరకాల పూలతో పండ్లతో ప్రత్యేక అలంకరణ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో హనుమత్ మాలధారణ స్వాములు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కాంటిజెంట్ వర్కర్లకు కనీస వేతనం చెల్లించాలి

## ఎన్ హెచ్ఎం రాష్ట్ర నేత బాపు యాదవ్ డిమాండ్



**వరంగల్ వాయిస్, మంచిర్యాల :** తెలంగాణ రాష్ట్రంలో ప్రైమరీ హెల్త్ సెంటర్లో పనిచేస్తున్న కాంటిజెంట్ వర్కర్ లకు వేతనాలు పెంచాలని జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర డిప్యూటీ సెక్రెటరీ బాపు యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రైమరీ హెల్త్ సెంటర్లలో (24★7) ముగ్గురు కాంటిజెంట్ వర్కర్లు ఉండాలి, ప్రస్తుతం ఇద్దరే పనిచేస్తున్నారు. కాబట్టి, ఇంకొకరిని డ్యూటీలోకి వెంటనే తీసుకోవాలని బాపు కోరారు. ఒకరు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు, ఇంకొకరు మధ్యాహ్నం 2 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు, మరొకరు రాత్రి 8 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకు ఇలా ముగ్గురు కాంటిజెంట్ వర్కర్లు రౌండ్ క్లాక్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పని చేయాలన్నారు. ఇందులో ఇప్పుడు 10వ తరగతి విద్యార్హత పొందిన వారు చాలా మంది ఉన్నారు. కాబట్టి, వారి హోదాను పేరు మార్చాలనీ వారిలో ఒక్కరిని మెడికల్ ఆఫీసర్ అసిస్టెంట్ గా పేరు మార్చాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 1206 మంది ఉన్నారని, ప్రస్తుతం వారి జీతం నెలకు రూ.11000/- మాత్రమే ఉందన్నారు. పెరిగిన ఖర్చులతో, చాలీచాలని జీతాలతో జీవితాలు నెట్టుకురాలేక వారంతా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాంటిజెంట్ వర్కర్ కనీస వేతనం రూ.19000 జీతం ఇవ్వాలని రాష్ట్ర డిప్యూటీ సెక్రటరీ దేవనబోయిన బాపు యాదవ్ కాంగ్రెస్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# భూమాత రైతు సంక్షేమ సంఘం జిల్లా కార్యదర్శిగా బిర్రు సతీష్



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** రైతుల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు సమర్థవంతంగా కృషి చేస్తూ సామాజికవేత్తగా ప్రజలకు సేవలందిస్తున్న స్థానిక యువకుడు, భూమాత రైతు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ ఆదేశానుసారం, జనగామ జిల్లా భూమాత రైతు సంక్షేమ సంఘం కార్యదర్శిగా బిర్రు సతీష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరి నియామక పత్రం అందజేశారు. ఈ బాధ్యతను అర్హంగా నిర్వహిస్తూ, రైతుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని నూతన జిల్లా కార్యదర్శి హామీ ఇచ్చారు. తనపై నమ్మకంతో ఈ పదవిని అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు బొజ్జ సమ్మయ్య యాదవ్ గారికి, జిల్లా అధ్యక్షుడు చెవుల యాదగిరికు, అలాగే ఈ నియామకంలో సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు.

# శ్రీ ప్రసన్నాంజనేయ స్వామికి పత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** స్థానిక పద్మాక్షి రోడ్డులో గల హనుమత్గిరి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో మంగళవారం స్వామివారికి పంచామృత అభిషేకం, చందన సేవ, స్వామివారికి ప్రత్యేక అలంకరణ డాలర్ "హనుమంతుడు,, విదేశీ కరెన్సీ తో, ఇండియన్ కరెన్సీతో అలంకరించారు. బ్రహ్మోత్సవాలలో మొదటి రోజు గణపతి పూజ పుణ్యవచనం, మండపారాధన, నవగ్రహ మాన్య సూక్తా హవనం దేవాలయ అర్చకులు ఆరుట్ల రామాచార్యులు, కృష్ణమాచార్యులు, భాస్కర చార్యులు ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 12గంటలకు భజన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. తదుపరి భక్తులకు అన్న ప్రసాదం 500 మందికి ఏర్పాటు చేశారు. ప్రతిరోజు మహా ప్రసాదాన్ని వితరణ భక్తుల సహకారంతో చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, కరుదశద్ కుమార్, గంద్రతి అంబటి నరేందర్, సుధాకర్, శంకర్, మొగులయ్య, సమ్మయ్య, హనుమాన్ స్వాములు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలి

- సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్
- 20న జరిగే దేశ వ్యాప్త కార్మిక సమ్మెకు మద్దతు



**వరంగల్ వాయిస్, కేయూ :** కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక చట్టాలను అడ్డుకోవాలని సాంకేతిక అఖిల భారత విశ్వవిద్యాలయ ఉద్యోగుల సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు, కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు డాక్టర్ పుల్లా శ్రీనివాస్ పిలుపునిచ్చారు. మంగళవారం కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం కార్యాలయంలో ఉద్యోగుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్న డాక్టర్ పుల్లా శ్రీనివాస్ మాట్లాడుతూ, ఉద్యోగ కార్మిక సంఘాల ఐక్యం గా నిర్వహిస్తున్న మే 20 దేశ వ్యాప్తిత సమ్మెకు కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం తరుపున సంపూర్ణ మద్దతు! ప్రకటించినట్లు వెల్లడించారు. తమ సంఘం నేతృత్వంలో సమ్మెలో భాగంగా మే 20న కేయూ పరిపాలన భవనం ఎదుట మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని పేర్కొన్నారు. కేంద్ర ఉద్యోగ, కార్మిక విధానాలకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు. కేంద్రంలో గతంలో ఉన్న 29 కార్మిక అనుకూల చట్టాలను రద్దు చేసిందన్నారు. 4 కొత్త కార్మిక నిర్బంద చట్టాలు తెచ్చిందన్నారు. గతంలో 10 మం ది పనిచేసే సంస్థలకు బోనస్, పీఎఫ్, గ్రాట్యూటీ సదుపాయాలను వర్తించేవన్నారు. తాజా చట్టాలతో 100 పనిచేసే సంస్థలకు బోనస్, పీఎఫ్, గ్రాట్యూటీ అందే విధంగా నిబంధనలు రూపొందించారని ఆందోళన వ్యక్తం చేశారు. గతం లో 7గురు కార్మికులతో సంఘాలను ఏర్పాటు చేసుకునే వీలుండగా తాజాగా 100 మంది ఉంటేనే సంఘాలను ఏర్పాటు చేసే అవకాశాలున్నాయని చెప్పారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, కార్మిక హక్కుల ఉల్లంఘనలతో పాటు కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ చేపడుతున్న సమ్మెకు తమ సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కేయూ సాంకేతిక ఉద్యోగుల సంఘం జనరల్ సెక్రటరీ ఎన్. రాము. గౌరవ అధ్యక్షుడు వి. నందయ్య, కోశాధికారి వి. ప్రేమాసాగర్, జాయింట్ సెక్రటరీ వైబాబు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అర్థమయ్యేలా బోధన జరగాలి

## జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**వరంగల్ వాయిస్, జనగామ :** రాబోయే విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచి, వారికి నాణ్యమైన, గుణాత్మక విద్య అందించాలనే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. జనగామలోని క్రీస్తు జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజుల పాటు నిర్వహిస్తున్న జిల్లా స్థాయి ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణా శిబిరాన్ని ఆయన ప్రారంభించారు.ఈ శిక్షణలో జిల్లా పరిషత్, మండల పరిషత్, ప్రభుత్వ, ఆదర్శ పాఠశాలలు, తెలంగాణ రాష్ట్ర రెసిడెన్షియల్ పాఠశాలలు, కొడకండ్ల, కేజీబీవీ వంటి పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాఠ్యాంశ బోధనలో విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ఉపాధ్యాయులు ఈ శిక్షణలో నేర్చుకున్న విషయాలను తమ పాఠశాల స్థాయికి తీసుకెళ్లి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలన్నారు. పాఠ్యాంశాన్ని పూర్తిచేయడమే కాకుండా, విద్యార్థులు ఎంతవరకు అర్థం చేసుకున్నారో తెలుసుకోవడం కూడా ఉపాధ్యాయుల బాధ్యత అని అన్నారు. ఈ తరహా శిక్షణలు ఉపాధ్యాయుల బోధన నైపుణ్యాలను మెరుగుపరిచి, విద్యార్థుల భవిష్యత్తును గుణాత్మకంగా తీర్చిదిద్దుతాయని చెప్పారు. పుస్తక జ్ఞానం కే పరిమితం కాకుండా, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో విద్యార్థుల మేధస్సును అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని ఆయన వివరించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి భోజన్న, ఏఎంవో బి. శ్రీనివాస్, కోర్సు ఇంచార్జులు మల్లికార్జున్, యాదగిరి, ఆనంద్ బాబు పాల్గొన్నారు.

# గట్లకానిపర్తి గ్రామంలో వారం సంత ప్రారంభం

**వరంగల్ వాయిస్, శాయంపేట :** గట్లకానిపర్తి గ్రామంలో గురువారం సాయంత్రం 4.00 గంటలకు గ్రామ ప్రజల సహకారంతో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో వారం సంత ఏర్పాటు చేయడం జరుగుతుంది. ప్రతి గురువారం సాయంత్రం జరిగే వారం సంత ( వారంలో ఒక రోజు అంగడి ) ద్వారా తాజా కూరగాయలు, నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు లభించే అవకాశం ఉంది. దూర ప్రాంతాలకు వెళ్లే అవసరం లేకుండా అందరికీ అందుబాటులో ఉండే ఇట్టి సదవకాశాన్ని గట్లకానిపర్తి గ్రామ ప్రజలే కాకుండా చుట్టు ప్రక్కన ఉన్న నర్సింహులపల్లి, పోచారం, వెల్లంపల్లి, సూరంపేట్, మాంధారిపేట, పులుకుర్తి, ల్యాదెళ్ల, వెంకటాపూర్, కౌకొండ, సర్వాపూర్ లాంటి గ్రామాల ప్రజలు, కొనుగోలుదార్లు, వ్యాపారస్థులు కూడా ఉపయోగించుకోవలసిందిగా గట్లకానిపర్తి గ్రామ అభివృద్ధి కమిటీ ద్వారా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# శ్రీ బుగులు వేంకటేశ్వర స్వామికి పూజలు

**వరంగల్ వాయిస్, చిల్పూర్:** జనగామ జిల్లా చిలుపూరు గ్రామం, మండలంలోని శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం ప్రత్యేక పూజా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. చిలుపూరు గుట్టపై ఉన్న ఆలయంలో శ్రీ స్వామివారికి అష్టదళ పాద పద్మారాధన పూజను బంగారు పద్మాలతో అర్చకులు వైభవంగా నిర్వహించారు. ఈ ప్రత్యేక పూజకు దేవాలయ చైర్మన్ శ్రీ పొట్లపల్లి శ్రీధర్ రావు, కిరణ్మయి గార్లు రూ. 516 చెల్లించి స్వామివారిని సేవించుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రామాల నుండి వచ్చిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

# లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ కమిటీ ఎన్నిక

- 81 మంది సభ్యులతో జంబో కమిటీ ఏర్పాటు




**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** లక్ష్మీపురం కూరగాయల మార్కెట్ వర్తక సంఘం కమిటీకి మంగళవారం నూతన కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమం కాశిబుగ్గలోని గ్రాండ్ గాయత్రి హోటల్లో ఘనంగా జరిగింది. మార్కెట్ వ్యాపారస్తుడు మరియు స్థానిక కార్పొరేటర్ చింతాకుల అనిల్ కుమార్ అధ్యక్షతన సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా జారితి శ్రీనివాస్ నూతన అధ్యక్షుడిగా, గులాం సర్వర్ మున్న ప్రధాన కార్యదర్శిగా, మల్లూరి బాబురావు కోశాధికారిగా నియమితులయ్యారు. మొత్తం 81 మంది సభ్యులతో కూడిన జంబో కమిటీని ఏర్పాటు చేయడం జరిగింది. కమిటీ ఏర్పాటుకు కార్పొరేటర్ సోమిశెట్టి ప్రవీణ్, మాజీ కార్పొరేటర్ జారితి రమేష్, గులాం అఫ్జల్, మజీద్ అహ్మద్ బాబా, కర్ర వెంకన్న, పార్ష గోపి, కర్ర నాగేశ్వర రావు, చింతాకుల సునీల్, దేవరపల్లి ఆనంద్, భిక్షపతి, సదానందం తదితరులు తమ ప్రతిపాదనలు వెల్లడించారు. కార్పొరేటర్ అనిల్ కుమార్ మాట్లాడుతూ, "మార్కెట్ చరిత్రలో ఎప్పుడూ లేనంత పెద్ద స్థాయిలో అన్ని వర్గాలను సమానంగా కలుపుకుంటూ కమిటీని ఏర్పాటు చేయడం గర్వకారణం. మార్కెట్ అభివృద్ధికి ఇది మైలురాయిగా నిలుస్తుంది. మంత్రి కొండా సురేఖ, మురళీధర్ రావు సహకారంతో సమస్యలను పరిష్కరిస్తూ ముందుకు సాగుతామని తెలిపారు. ఈ కమిటీ రానున్న ఐదు సంవత్సరాల పాటు పని చేయనున్నట్టు తీర్మానించారు. మార్కెట్ అభివృద్ధి, సమస్యల పరిష్కారంలో సమిష్టిగా ముందుకు సాగుతామని సభ్యులు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పిన్న మల్లేశం, జాలా రాజేందర్, భారతి వెంకన్న, మోయిద్ కర్ణాకర్, సూరం రాజేందర్, హరి ప్రసాద్, రాజకుమార్, సుధాకర్, నాగరాజు, విజయ్, అనిల్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మినీ హోల్సేల్, 6x6 ప్లాట్లు, 158 మంది కాంప్లెక్స్ వ్యాపారులు, ఆకుకూరల వర్తకులు కూడా హాజరయ్యారు.

# కాలేజీ డేస్‌లోనే తెలుసు..



కాలేజ్ డేస్ నుండే మహేష్ బాబుతో త్రిష పరిచయయముందంట. సూపర్ స్టార్ మహేష్ బాబు, త్రిష జోడీ గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. ఈ జోడికి మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ కూడా ఉంటుంది. వీరిద్దరు అతడు సినిమాలో నటించగా, అప్పట్లో ఎంత పెద్ద విజయం సాధించిందో అందరికీ తెలిసిన విషయమే. ఇప్పటికి కూడా ఈ సినిమా టీవీలో వేస్తే చాలు ఎంతోమంది చూస్తూ ఉంటారు. ఒక రకంగా టీవీలో బ్లాక్ బస్టర్ సినిమా ఏది అంటే అతడు అనే అంటారు అందరూ. మహేష్ బాబు త్రివిక్రమ్ శ్రీనివాస్ కాంబోలో వచ్చిన ఈ సినిమా థియేటర్స్ లో పెద్దగా ఆకట్టుకోలేకపోయిన బుల్లి తెరపై మాత్రం మంచి విజయం సాధించింది. ముఖ్యంగా ఈ చిత్రంలో త్రిష, మహేష్ మధ్య సన్నివేశాలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. బావ ప్రేమకోసం ఎదురుచూసే పల్లెటూరి అమ్మాయిగా త్రిష పాత్రలో ఒదిగిపోయింది. ఇక మహేష్ బాబు కూడా కాస్త యాటిట్యూడ్ ప్రదర్శిస్తూ సీరియస్‌గా చాలా అద్భుతంగా నటించారు. వారిద్దరి పాత్రలకి ప్రేక్షకులు ఇట్టే కనెక్ట్ అయ్యారు. అతడు తర్వాత త్రిష మహేష్ బాబు కలిసి సైనికుడు సినిమా చేశారు. కానీ ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. ఆ తర్వాత త్రిష, మహేష్ బాబు కలిసి నటించలేదు. ఇదిలా ఉంటే ఓ ఇంటర్వ్యూలో మహేష్ బాబు గురించి త్రిష ఆసక్తికర కామెంట్స్ చేసింది. మహేష్ బాబు తన ఫేవరెట్ హీరోల్లో ఒకరు అని చెప్పిన ఈ ముద్దుగుమ్మ .. మహేష్ బాబు సెట్ లో చాలా సరదాగా ఉంటాడని, చాలా హార్డ్ వర్క్ చేస్తాడు అని పేర్కొంది.. ఎంత పెద్ద స్టార్ హీరో అయినా కూడా అందరిని చాలా గౌరవిస్తాడు. అసలు కారవాన్ లోకి కూడా వెళ్లడు. తన షూటింగ్ అయిపోయినా కూడా .. మానిటర్ దగ్గర కూర్చొని ప్రతి ఒక్కటి గమనిస్తూ ఉంటారు.. చాలా మందికి తెలియని విషయం ఏంటంటే మహేష్ బాబు నాకు చాలా కాలం నుంచి తెలుసు. మేము ఇద్దరం కాలేజ్ డేస్‌లో చెన్నైలో ఉన్నాము. మా ఇద్దరికి మ్యూచువల్ ఫ్రెండ్స్ ఉండేవారు. వారి వల్ల మహేష్ తో పరిచయం ఏర్పడిరది. ఆ టైం లో మేము యాక్టర్స్ అవుతామని ఊహించలేదు. అప్పుడు హాయ్, బాయ్ ఫ్రెండ్షిప్ మాత్రమే ఉండేది అని త్రిష పేర్కొంది. ఇక ఈ అమ్మడు చాలా రోజుల తర్వాత తెలుగులో చిరంజీవితో విశ్వంభర చేస్తుంది.




# బిస్లరీ వాటర్‌తో స్నానం

- నటి శ్రీవిద్య



ఎవరి సమయంలో వారు బెట్టుగా ఉంటారు. నిర్మాతలను ఓ ఆటాడుకుంటారు. అలాంటి ఘటనే శ్రీవిద్య విషయంలోనూ జరిగిందట. కొంత మంది హీరోయిన్‌లు చాలా డిమాండిరగ్‌గా ఉంటారు. నిర్మాతలను నానా రకాలుగా ఇబ్బంది పెడుతూ ఉంటారు. ఇందులో భాగంగా తాజాగా ఓ హీరోయిన్ సంబంధించిన వార్త ఒకటి వైరల్ అవుతుంది. ఆమె స్నానానికి కూడా బిస్లరీ వాటర్ కావాలని డిమాండ్ చేసిందట. నటి శ్రీవిద్య.. ఒకప్పుడు స్టార్ హీరోయిన్‌గా వెలుగొందిన ఆమె తన యాక్టింగ్ తో సినీ పరిశ్రమలో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 800కి పైగా సినిమాల్లో నటించిన ఆమె, నటనతో పాటు– పాటలు పాడడంలోనూ, డబ్బింగ్‌లోనూ తన ప్రతిభను చాటారు. చైల్డ్ ఆర్టిస్ట్ నుంచి హీరోయిన్‌గా.. అటు–పై సపోర్టింగ్ రోల్స్ చేస్తూ అమ్మ, అక్క, చెల్లి, అత్త వంటి క్యారెక్టర్లతో అలరించారు. ఆమె పండిరచే భావోద్వేగాలకు ప్రేక్షకులు ఫిదా అయిపోయేవారు. అయితే ఓ తెలుగు సినిమా షూటింగ్ సమయంలో రాజమహేంద్రవరం వద్ద గోదావరి నీటితో స్నానం చేయాలంటే గ్లామర్ దెబ్బతింటు–ందని, తనకు కచ్చితంగా బిస్లరీ నీరు తెప్పించాలని పంతం పట్టిందట. అప్పట్లో లీటర్ బాటిల్ రూ.6. దీంతో తప్పేది లేక రెండు బకెట్ల బిస్లరీ నీటిని తెప్పిస్తే అప్పుడు ఆమె స్నానం చేశారట.

# నిర్మాణం పూర్తి చేసుకుంటున్న కూలీ




## ముందు అనుకున్న స్టోరీ వేరన్న లోకేశ్ కనగరాజు

రజనీకాంత్ కథానాయకుడిగా లోకేశ్ కనగరాజ్ దర్శకత్వంలో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ 'కూలీ' . నాగార్జున, ఉపేంద్ర, సౌబిన్ షాహిర్, సత్యరాజ్, శ్రుతిహాసన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. దాదాపు చిత్రీకరణ పూర్తి చేసుకున్న ఈ మూవీ ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుపుకొంటోంది. ఈ క్రమంలో దర్శకుడు లోకేశ్ కనగరాజ్ ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు.

రజనీకాంత్‌కు తొలుత వేరే కథ చెప్పానని, అది ఆయనకు నచ్చినా అనుకోని కారణాలతో ఈ కథను పక్కన పెట్టినట్లు– తెలిపారు. అయితే, అది కార్యరూపం దాల్చలేదు. దాదాపు రెండు నెలలకు పైగా ఆ స్క్రిప్ట్‌పై వర్క్ చేశాం. ఆ కథ, దాని నేపథ్యం రజనీ సర్‌కు బాగా నచ్చాయి. రెండు నెలల తర్వాత మళ్లీ ఆయన్ను కలిసినప్పుడు 'ఈ కథ వద్దు. మరొక స్టోరీ చేద్దాం' అని అన్నాను. అదే 'కూలీ'. రజనీ సర్‌కు ఆ స్టోరీ నచ్చినా నేను చేయకపోవడానికి ఒక కారణం ఉంది. నేను అనుకున్న పాయింట్ ఒక చోట పూర్తిగా డౌన్ అయిపోయినట్లు– అనిపించింది. దీంతో ఆ ప్రాజెక్ట్‌పై ఆసక్తి సన్నగిల్లిపోయింది. భవిష్యత్‌లో ఎప్పుడైనా కొత్త ఆలోచన వస్తే, ఆ కథను అందుకు అనుగుణంగా ముందుకు తీసుకెళ్తా. అంతేకానీ, అదే కథను పట్టుకుని రజనీ సర్ విలువైన సమయాన్ని వృథా చేయటం నాకు ఇష్టం లేదని లోకేశ్ కనగరాజ్ చెప్పుకొచ్చారు. ఐటమ్ సాంగ్‌లో పూజా హెగ్డే ఆడి పాడిరది. ఆమిర్‌ఖాన్ కూడా అతిథి పాత్రలో తళుక్కున మెరవనున్నారు. ఆగస్టు 14న తమిళ, తెలుగు, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో 'కూలీ'ని విడుదల చేయనున్నారు. ఐమ్యాక్స్ ఫార్మాట్‌లోనూ ఈ మూవీ తీసుకొస్తున్నారు. రజనీకాంత్ ఇందులో కూలీ నెంబర్ 1421గా దేవా పాత్రలో సందడి చేయనున్నారు. అనిరుధ్ స్వరాలు సమకూరుస్తున్న ఈ చిత్రాన్ని సన్ పిక్చర్స్ నిర్మిస్తోంది.

# జయం రవి, కెనిషాల మధ్య పెరిగిన బంధం

## భార్య ఆర్తి కామెంట్స్‌కు కెనీషా ఘాటు జవాబు

హీరో జయం రవి ఇంటి గురించి రోజుకో వార్త వైరల్ అవుతున్న విషయం తెలిసిందే. ముందు నుంచి సింగర్ కెనీషా ఫ్రాన్సిస్ కి జయం రవి కి మధ్య రిలేషన్ ఉన్నట్లు రూమర్స్ నడుస్తున్నాయి. రీసెంట్ గా ఓ పెళ్లికి వీరిద్దరు జంటగా హాజరవడంతో మరోసారి కోలీవుడ్ లో పుకార్లు మరింత పుంజుకున్నాయి. ఈ ఫోటో క్షణాల్లోనే సోషల్ మీడియా మొత్తం వైరల్ అవ్వడంతో ఇది చూసిన జయం రవి భార్య ఆర్తి సోషల్ మీడియాలో సంచలన పోస్ట్ చేసింది. 'మాకు చట్టరిత్యా ఇంకా విడాకులు అవ్వలేదు, విడాకులు వచ్చేవరకు నేను ఆర్తి రవినే, 18 సంవత్సరాలు నాతో కలిసి ఉన్న వ్యక్తి నన్ను ఇంట్లో నుండి గెంటేసి, పిల్లలను కూడా పట్టించుకోకుండా, వారి అవసరాలకు కావలసిన డబ్బు కూడా ఇవ్వడం లేదు' అంటూ షాకింగ్ పోస్ట్ చేసింది. అయితే ఈ మాటలపై తాజాగా సింగర్ కెనీషా రివర్స్ పంచ్ ఇచ్చింది.. ఎవరికీ లొంగని ఒక మగాడు.. ఏ మహిళతో అయితే ఆనందం ఉంటుందో ఆ మహిళ దగ్గరే ఉంటాడు. ఆ మహిళకే మనసు ఇస్తాడు. మౌనంగా ఉంటున్నాను కదా అని నన్ను లైట్ తీసుకోకు.. నా మౌనమే నా బలం' అంటూ ఆర్తికి పరోక్షంగా కొటేషన్‌తో కౌంటర్ ఇచ్చింది. దీంతో సింగర్ కెనీషా పెట్టిన పోస్ట్ ఇప్పుడు నెట్టింట వైరల్ గా మారింది. అంటే దీని అర్థం ఆర్తి దగ్గర ప్రశాంతత లేకపోవడం వల్లే కెనిషాకి జయం రవి దగ్గరై ఆమెకు మనసిచ్చాడని పూర్తిగా అర్థమవుతుంది అంటూ నెటిజన్ల కామెంట్లు పెడుతున్నారు.



# అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు

- **అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ**
- **సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణతోపాటు వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు చేపట్టాలని రాష్ట్ర అటవీ, పర్యారణ శాఖ మంత్రి కొండా సురేఖ సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. మంగళవారం సచివాలయంలోని తన ఛాంబర్ నుంచి రాష్ట్రంలోని వివిధ జోన్ల సీసీఎఫ్ లు, అన్ని జిల్లాల డీఎఫ్ఓలతో మంత్రి సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అడవుల్లో అగ్ని ప్రమాదాల నివారణకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారంటూ మంత్రి ఆరా తీశారు. భారీ అగ్ని ప్రమాదాలు జరిగితే అరికట్టేందుకు కావాల్సిన పరికరాలు అందుబాటులో ఉన్నాయా అంటూ వాకబ్ చేశారు. ఏ జిల్లాలో ఎక్కువ అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయి.. వాటి వల్ల వన్యప్రాణులకు ఇబ్బందులు కలుగకుండా తీసుకుంటున్న చర్యలపై అడిగి తెలుసుకున్నారు. వేసవి దృష్ట్యా అడవుల్లో, జూలలో వన్యప్రాణులు, ఇతర జంతవులకు చాలినంత తాగునీటి సదుపాయాలు ఉన్నాయా అంటూ ప్రశ్నించారు. అయితే, ఈ వేసవిలో జంతువుల కోసం 2,168 నీటి గుంతలు ఏర్పాటు చేసినట్లు వైల్డ్ లైఫ్ బోర్డు ఉన్నతాధికారులు మంత్రికి వివరించారు. నీటి గుంతల్లోకి నీటిని ప్రతిరోజూ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నింపుతున్నట్లు వెల్లడించారు. నెహ్రూ జూ పార్కు, వరంగల్ జూ పార్కులలో ప్రత్యేక శ్రద్ధ వహించాలన్న మంత్రి సురేఖ అధికారులను ఆదేశించారు. వన్యప్రాణులకు నీరు, ఆహారం విషయంలో ఎటువంటి అశ్రద్ధ వహించద్దన్నారు. ప్రత్యేకంగా నీటి లభ్యత ఉన్న ఆహార పదార్థాలు, పండ్లను(దోసకాయ, పుచ్చకాయ వంటి) వాటిని ఆహారంగా అందజేయాలని సూచించారు. కాగా, ఈ వీడియో కాన్ఫరెన్స్ లో పీసీసీఎఫ్ (హెఓఎఫ్ఎఫ్) డాక్టర్ సువర్ణ, పీసీసీఎఫ్ (వైల్డ్ లైఫ్) ఈఈలు సింగ్ మేరు, పీసీసీఎఫ్ (స్కీమ్స్) జవహర్, వైల్డ్ లైఫ్ ఓఎస్డీ శంకరన్, నెహ్రూ జూ పార్క్ డైరెక్టర్ సునీల్ హీరామత్ తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ఆర్ఎస్ గడువు పొడిగింపు

**వరంగల్ వాయిస్, వరంగల్ :** తెలంగాణ ప్రభుత్వం లేఅవుట్ రెగ్యులరైజేషన్ స్కీమ్ (ఎల్ఆర్ఎస్) గడువును మరో మారు పెంచింది. ఫీజు చెల్లింపుపై 25 శాతం రాయితీ వర్తించే గడువును తాజాగా మే 31, 2025 వరకు పొడిగిస్తూ అధికారిక ఉత్తర్వులు జారీ చేసింది. ఇందుకు సంబంధించిన జీఓను మంగళవారం విడుదల చేసింది. ప్రభుత్వం ఫిబ్రవరిలో ప్రకటించిన వన్ టైం సెటిల్మెంట్ స్కీమ్‌లో భాగంగా తొలుత మార్చి 31 వరకు ఈ రాయితీ గడువును అందుబాటులోకి తెచ్చింది. అనంతరం దానిని ఏప్రిల్ 30 వరకు పొడిగించారు. ఏప్రిల్ చివరి వారంలో ప్రభుత్వ సెలవులు రావడంతో ఫీజు గడువును మరో మూడు రోజులు పొడిగించి మే 3 వరకు చెల్లించుకునేలా అవకాశం కల్పలించింది. తాజాగా మే 31 వరకు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.



# ఈ జీవితం ప్రజాసేవకే అంకితం

☐ **మాజీ ఎమ్మెల్సీ కొండా మురళి**

**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** ఈ జీవితం ప్రజా సేవకే అంకితం అని మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు తెలిపారు. మంగళవారం వరంగల్ ఓ సిటీలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా కొండా మురళీధర్ రావు మాట్లాడుతూ ప్రజా సమస్యలు తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కారం చూపడం ప్రజాపాలనకు నిదర్శనం అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కొండా సురేఖ నాయకత్వంలో వరంగల్ నగరాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిచే విధంగా తీర్చిదిద్దుతామన్నారు. ప్రజలు ఏ సమస్య ఉన్నా పైరవీలు చేయకుండా నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చన్నారు. వరంగల్ క్యాంప్ కార్యాలయంలో కానీ హనుమకొండ రాంనగర్ లో తాను అందుబాటులో లేకున్నా తన సిబ్బంది ఎల్లవేళలా ఉంటారని ఎలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతులు అండగా ఉంటారని మరిచిపోరాదన్నారు.

# దామెరలో మహిళా డైరీ ఏర్పాటు

**ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి**



**వరంగల్ వాయిస్, దామెర :** పరకాల నియోజకవర్గంలోని దామెరలో మహిళా డైరీ ఏర్పాటు చేయనున్నట్టు స్థానిక ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి తెలిపారు. ఆరు మండలాలలోని మహిళా రైతులతో డైరీ ఏర్పాటు చేస్తునామని ఇందుకు గాను 53 కో–ఆపరేటివ్ సంఘాలను రిజిస్ట్రేషన్ చేయించి ముల్కనూర్ డైరీ ద్వారా శిక్షణ ఇస్తునట్టు తెలిపారు. ఇట్టి డైరీ ద్వారా కల్తీ లేని స్వచ్ఛమైన పాలు సరఫరా చేయడం, మహిళలని వ్యాపారరంగంలో ముందుకు తీసుకెళ్లడం, డైరీ ద్వారా ఉద్యోగం కల్పన కూడా సాధ్యమవుతుందన్నారు. భీమదేవరపల్లి మండలంలోని ముల్కనూర్ సొసైటీలో పరకాల నియోజకవర్గంలోని మహిళా రైతులకు శిక్షణ కార్యక్రమానికి హనుమకొండ, వరంగల్ జిల్లాల కలెక్టర్లు పి.ప్రావీణ్య, డాక్టర్ సత్య శారద, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారులు హాజరయ్యారు.

# ప్రజల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

- **దేశంలో ఎక్కడా లేని విధంగా సంక్షేమ పథకాల అమలు**
- **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



**వరంగల్ వాయిస్, బయ్యారం :** ప్రజలందరి సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. మంగళవారం మహబూబాబాద్ జిల్లా ఇల్లందు నియోజకవర్గంలోని లక్ష్మీనరసింహపురంలో 33/11 కె వి విద్యుత్ సబ్ స్టేషన్ కు శంకుస్థాపన చేసిన అనంతరం ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య అధ్యక్షతన ఏర్పాటు చేసిన బహిరంగ సభలో భట్టి విక్రమార్క ప్రసంగించారు. ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ రాష్ట్ర ప్రజలపై ఒక్క రూపాయి భారం మోపకుండా వేల కోట్లతో సంక్షేమ పథకాలు తీసుకువస్తున్నాం అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని సంక్షేమ పథకాలు తీసుకురాబోతున్నట్టు తెలిపారు. గిరిజన నియోజకవర్గాల్లో అదనంగా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసే ఆలోచనలో ప్రభుత్వం ఉందని వివరించారు. అటవీ హక్కుల చట్టం కింద ప్రభుత్వ హయాంలో పట్టాలు పొందిన గిరిజన రైతులు సాగు చేసుకునేందుకు వీలు కల్పించిందని అన్నారు. గిరిజన రైతులకు భరోసా కల్పించేందుకు ఇందిరమ్మ ప్రభుత్వం ఇందిరా సౌర గిరి జల వికాసం పథకాన్ని ఈనెల 18న నాగర్ కర్నూలు జిల్లా అచ్చంపేటలోని చెంచు కాలనీలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదగా ప్రారంభించబోతున్నాం అని ప్రకటించారు. ఈ పథకం కింద రూ.12,500 కోట్లు ఖర్చు చేయనున్నట్లు తెలిపారు. ప్రతి మూడు నెలలకు గిరిజనులకు ఆదాయం వచ్చేలా ఉద్యానవన శాఖతో ప్రణాళికలు సిద్ధం చేసినట్టు వివరించారు. ఈ పథకం కింద ప్రతి గిరిజన రైతుకు సోలార్ విద్యుత్ పంపు సెట్టు, స్ప్రింక్లర్లు, అవకాడో, పామ్ ఆయిల్ వంటి మొక్కలు ఉచితంగా అందజేస్తాం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్ డాక్టర్ జాటోత్ రామచంద్రునాయక్, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, మహబూబాబాద్ శాసనసభ్యులు డాక్టర్ భూక్య మురళి నాయక్, వైరా శాసనసభ్యులు రామ్ దాస్, జిల్లా కలెక్టర్ అద్వైత్ కుమార్ సింగ్, విద్యుత్ సీఎండీ వరుణ్ రెడ్డి, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేక, అదనపు కలెక్టర్ కె.వీరబ్రహ్మాచారి, సూపరింటెండెంట్ ఇంజనీర్ నరేష్, మూల మధుకర్ రెడ్డి, ఆర్డీఓ కృష్ణవేణి, అన్ని విభాగాల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# వెయ్యి మందితో ప్రత్యేక నిఘా

- **ప్రపంచ సుందరీమణుల పర్యటన సందర్భంగా భారీ బందోబస్తు**
- **వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్**




**వరంగల్ వాయిస్, క్రైం :** పోలీసుల భారీ భద్రతల నడుమ ప్రపంచ సుందరీమణుల రేపటి పర్యటన కొనసాగుతుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న మిస్ వర్లల్ పోటీలకు సంబంధించి హెరిటేజ్ పర్యటనలో భాగంగా బుధవారం హనుమకొండ, వరంగల్ నగరాల్లో పర్యటిస్తున్న ప్రపంచ సుందరీమణుల భద్రత ఏర్పాట్లపై వరంగల్ సీపీ మంగళవారం పోలీస్ కమిషనరేట్ కార్యాలయములో సంబంధిత పోలీస్ అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో వేయిస్తంభాల దేవాలయం, ఖిలా వరంగల్, హరిత కాకతీయ ప్రాంతాల్లో సుందరీమణుల భద్రత కోసం తీసుకుంటున్న చర్యలపై పోలీస్ కమిషనర్ సెక్టార్ వారిగా ఇంచార్జి పోలీస్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. సుందరీమణులు బస్సులో ప్రయాణించే రోడ్డు మార్గంలో ఎలాంటి సమస్యలు రాకుండా తీసుకుంటున్న భద్రత ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ అధికారులతో సమీక్షా జరిపారు. ముఖ్యంగా వారి పర్యటనను పర్యవేక్షించేందుకు వరంగల్, హనుమకొండ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్న సీసీ కెమెరాలతో పాటు అదనంగా మరిన్ని సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాల్సిందిగా పోలీస్ కమిషనర్ అధికారులను అదేశించారు. ప్రపంచ సుందరీమణుల పర్యటన సందర్భంగా వారి భద్రత కోసం వరంగల్ పోలీస్ కమిషనరేట్ వెయ్యి మందికి పైగా పోలీసులు ఇందుకు వినియోగించడం జరుగుతోందన్నారు. ఇందులో ముగ్గురు డీసీపీలు, ఒక అదనపు డీసీపీ, 11ఏసీపీలు, 32మంది ఇన్స్పెక్టర్లు, 81 మంది ఎస్సైలు, 155 మంది ఏఎస్ఐ/హెడ్‌కానిస్టేబుళ్లు, 325 మంది కానిస్టేబుళ్లు, 106 మంది మహిళా పోలీస్ సిబ్బంది, 210 హోంగార్డులతో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్, బాంబ్ డిస్పోజబుల్, డాగ్ స్క్వాడ్ విభాగాలకు చెందిన పోలీసులను వినియోగించడం జరుగుతోందన్నారు. ప్రతి పోలీస్ అధికారి అప్రమత్తతతో ఉండాలని, విధులు నిర్వహించాలని వరంగల్ పోలీస్ కమిషనర్ అధికారులకు సూచించారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com